# కొత్త చూపు

రామలింగం పొద్దుణ్ణుంచీ మొక్కలు నాటుతూనే వున్నాడు. వంచిన నడుం ఎత్తలేదు.

పొద్దువాలింది. ఆ రోజు పని ముగిసింది. తలెత్తాడు. నిలబడ్డాడు. నడుం మీద చేతుల్తో వత్తుకున్నాడు.

ఆవులిస్తూ రోడ్డుకు రెండు పక్కలా సోలుపులు సోలుపులుగా వున్న మొక్కల్ని చూశాడు. ఎంత ఆనందం!

రోడ్డున పడి పోతుంటే మొక్కలు తలలు వంచుకొని వినయంగా నిలబడ్డాయి.

పెరిగి పెద్దదై తలెత్తుకొని నిలబడ్డప్పుడు ఎంత దర్జా!

వంద మొక్కలయినా నాటాడు రామలింగం ఇవాళ! రోజూ ఇదేపని!

రామలింగం పసిపిల్లల్ని తాకినట్లు మొక్కల్ని తాకుతాడు. అంత సున్నితం.

మొక్క వేళ్ళకు నొప్పితగలకుండా మెత్తగా గోతిలో పెట్టి, చెమ్మమట్టి చిదిపి, పొడిరాల్చి, ఒండ్రు మట్టి వేసి, ఆ పైన ఇసుక మట్టి పోసి, పూడ్చి, ఇన్ని నీళ్ళు చిలకరించి రామలింగం లేచి నిలబడుతుంటే గుళ్లో పూజచేసి నిలబడ్డ పూజారి గుర్తొస్తాడు. అంత భక్తి.

ఏ ఒక్క మొక్కకో కాదు అన్ని మొక్కలకూ అంతే!

ఆసుపత్రి రోడ్డుమీద తలలొంచుకొని నిలబడ్డ మొక్కలు వైద్యం కోసం వెళ్ళే రోగుల్ని పిలవడం లేదు. తలపటం లేదు. చూడటం లేదు.

బ్రతకటం, బట్ట కట్టటం, బాగు పడటం, గూర్చి కలలు కంటున్నాయి మొక్కలు.

రామలింగం ఇంటికి వెళ్ళేసరికి నాగమ్మ కొంపలంటుకున్నట్లు అరచి గగ్గోలెత్తి పోతూ వుంది.

రోజంతా పడ్డ కష్టంతో, వళ్ళంతా పుట్టేనొప్పి మర్చిపోయి, రామలింగం గబగబా గుడిసెలోకి పోయాడు.

చాపమీద నాగమ్మ. పక్కనే పెద్దమ్మ. పురిటినొప్పులు. తొలికాన్పు.

నాగి తల్లీ, తాను తండ్రీ కాబోతున్న శుభసమయం వచ్చిందని రామలింగం పొంగిపోతున్నాడు.

నాగమ్మ అరుస్తూ వుంటే బాధగా వున్నా, సంతోషంగానూ వుంది.

నొప్పి తెరతగ్గి అలసటగా అశాంతిగా నాగమ్మ కదులుతూ వుంది.

పెద్దమ్మ పొయిలో పిల్లిని తోలటానికి పోయింది.

దగ్గర కూర్చున్న భర్తకు మరీ దగ్గరకు రమ్మని సైగ చేసి, రెండు చేతులూ పట్టుకొని ఈ పోకిరీవాడు చూడు ఎట్లా తంతున్నాడో' అని పొట్టచూపించింది. నాగమ్మ పొట్ట అలలు అలలుగా కదులుతూవుంది.

పొద్దుట ఆసుపత్రికి నాగమ్మను తీసుకుపోతున్న రామలింగం ఆ రోడ్డు పక్కన తాను నిన్న నాటిన మొక్కలకు లారీవచ్చి నీళ్ళుపోస్తూవుంటే చూశాడు.

వద్దు వద్దని మొక్కలు మునుగుతున్న తలలూపుతూ మొత్తుకుంటున్నా వినకుండా ఇంకొంచెం ఇంకొంచెం అంటూ గొట్టం నీళ్ళు పోస్తూవుంది.

'అయ్యయ్యో' అనుకుంటూ రామలింగం ఆగి 'కొంచెం కొంచెం పోయి' అని చెప్పి వెళ్ళిపోయాడు.

స్వీటు ఇస్తే చూచే పసివాళ్ళలాగా మొక్కలు నంగి నంగిగా నవుతూ తలలాడించాయి.

నొప్పులెక్కువయితే నాగమ్మను కాన్పుల గదిలోకి తీసుకుపోయారు. తలుపులు వేశారు. మనిషి కనిపించటంలేదు. అరుపులు మాత్రం వినిపిస్తున్నాయి.

గొంతు నాళం తెగిపోతుందా అన్నట్లుగా పెద్దగా అరిచింది నాగమ్మ. బైట బెంచీమీద కూర్చున్న రామలింగం గుండె జారిపోయినట్లయింది.

అంతలో పసిగొంతు కెవ్వుమంది. కేరుకేరుమంది.

జారిన రామలింగం గుండె పైకి చేరింది. ఆడుకొంది. అల్లరి చేసింది.

ఈ గొంతు ఈ లోకంలో ఇంతకుముందు లేదు. ఇది నా గొంతు. నాగి గొంతు. రెండూ కలిసిన మాగొంతు.

నూరేళ్ళు లోకంలో వినిపించబోయే గొంతు మొట్టమొదట విన్న అదృష్ట వంతుణ్ణి.

గొంతు ఎంత మధురంగా ఉంది! తన గుండెకు కొట్టుకోవటం నేర్పుతూ వుంది.

రామలింగం అనుకున్నట్లుగానే కొడుకు పుట్టాడు. తల్లీ కొడుకు హాయిగా ఆరోగ్యంగా వున్నారు.

ఆసుపత్రినుంచి ఇంటికి వెళుతున్న రోజు రోడ్డుపక్క మొక్కలు స్కూలు పిల్లల్లాగా ప్రసన్నంగా చేతులూపుతూ నిలబడ్డాయి.

ఎండు ఆకులు రాలిపోయాయి. మొక్కలు పచ్చబడ్డాయి. రేపోమాపో చిగురు వేస్తాయి.

రామలింగం సంతోషంగా గుడిసెలోకి బాబును తీసుకువచ్చి ఇది నీ సామ్రాజ్యం అని పరిచయం చేసి, పరిపాలించుకోమని పట్టాభిషేకం చేసి, చాప సింహాసనం చూపిస్తే, బాబు కూర్చోకుండా పడుకొని ఏడుపులతో ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు.

తల్లీ దండ్రి ప్రధాన మంత్రులై ప్రభువుల వారి ఆజ్ఞలను అమలు పరుస్తు న్నారు.

పుట్టినప్పుడు ముద్దుగా బొద్దుగా ఆరోగ్యంగా ఉండేవాడు. ఇప్పుడేమో రోజు రోజుకి అకారణంగా సన్నగా అనారోగ్యంగా తయారవుతున్నాడని నాగమ్మ గోల పెడుతూనే వుంది. రామలింగం మందులూ, మాకులూ తెస్తూనే వున్నాడు. వాడుతూనే వున్నారు.

వెదురు బద్దలతో గూడు బుట్టలల్లి మొక్కల చుట్టూ నాటితే పొయ్యిల్లోకి పొయ్యాయో పొలాల్లోకి పోయాయో మాయమయ్యాయి. పత్తాలేవు.

అందుకని చుట్టూ గోడతో, చదరం గోడతో, మొక్కల చుట్టూ కట్టటానికి నిశ్చయించుకొని రామలింగాన్ని పిలిచారు.

మొక్క మొక్కకీ కంతలు కంతలుగా ఇటుకలతో గజం చదరంలో గోడ కడుతుంటే ఇటుకలందిస్తూ ఉన్నాడు రామలింగం.

పనిచేస్తున్నంత సేపూ మొక్కలు నవ్వుతూ పలకరిస్తూనే వున్నాయి.

వారం రోజుల్లో, ఆసుపత్రి రోడ్డు మొక్కల చుట్టూ, కాపలా కట్టడాలు నిలిచాయి. చూస్తుంటే ఎందుకో బాధ కలిగింది.

పసివాళ్ళను జైల్లో పెట్టినట్లు అన్పించింది.

ఆదేమిటో తెలియకుండా, ఎందుకయినా నోళ్ళు తెరిచే పసి ప్రాణాలులాగా మొక్కలు కన్నాల్లోంచి నిక్కి నిక్కి చూస్తున్నాయి.

జాలివేసింది.

బాబుకు విరేచనాలు అన్న విషయం విన్నప్పుడు రామలింగం నవ్వు ఆపుకోలేకపోయాడు.

ఎందుకంత నవ్వు అంటే ఏం చెబుతాడు?

చూడు నాగీ నీకున్న పాలన్నీ ఆ పసివాడు తాగాలంటే వాడికి ఓపిక వుండొద్దూ ?

రామలింగం నవ్వుతూనే వున్నాడు.

నాగమ్మకు కోపం వచ్చింది. సిగ్గూ కలిగింది. ప్రేమా పుట్టింది.

'సర్లే' అంటూ వెళ్ళిపోయింది.

బాబును తీసుకొని ఆసుపత్రికి వెళుతుంటే మొక్కలు తల్లి చాటు పిల్లలాగ నవ్వుకున్నాయి.

ఆ సిమ్మెంటు, ఇటుకలు, కన్నాలు చూస్తుంటే రామలింగం వళ్ళుమండి పోతూ వుంది.

మొక్కలకు ఇటుకలు సిమ్మెంటు - తన గుడిసెకు మట్టి తాటాకులు.

తన కూలీ డబ్బులతో కాస్తో కూస్తో తిని, ముతకో అతుకో కట్టుకొని, సిమ్మెంటు ఇటుకలతో ఇల్లు-

రామలింగం ఆలోచించుకొంటూపోతుంటే-

తన తాటాకు పాక గాలికి లేచిపోయినట్టు, వానకి మట్టిగోడలు విడిపోయినట్టు బాబు దుమ్ములో, ధూళిలో రోడ్డుపక్క బురదలో-

రామలింగం నడవటం ఆపి మొక్కల్ని చూశాడు.

కోటలో రాజకుమారుల్లా మొక్కలు నవ్వుతున్నాయి.

ఈసారి నాగమ్మ నొప్పులు పడుతుంటే రిక్షాలో పక్కనే కూర్చోబెట్టుకుని ఆసుపత్రికి తీసుకుపోయాడు రామలింగం.

ఆసుపత్రి రోడ్డులో మొక్కల ముఖాలు చూస్తుంటే గుండె చెరువయింది.

కొన్ని ఇటుకలు వానకు కరిగి మట్టిలో కలిశాయి.

కొన్ని ఇటుకలు లేనివాళ్ళ ఇళ్ళ గోడల్లో ఉన్నాయి.

కొన్ని సిమ్మెంటుతో చెట్టాపట్టాలు వేసుకొని మురుక్కాలవలో ఉన్నాయి.

మొత్తానికి మొక్కల చుట్టూ సిమ్మెంటు లేదు. ఇటుకలు లేవు.

నొప్పులెక్కువయి అరుస్తున్న నాగమ్మను గుండె కలుక్కుమంటున్న రామలింగం తీసుకుపోయాడు.

రెండోవాడూ కొడుకే అయినప్పుడు తల్లి అనురాగ తరంగిణి. తండ్రి ఆనందసముద్రుడు.

ఈ వారం రోజుల్లో పెద్దబాబుని సైకిల్ ఒకటి పడేసింది. లారీ వచ్చి బాబుకు పరుగు నేర్పింది. ఆవు తోకతో మంత్రం జపించింది.

రెండోవాడికి విరేచనాలకు మందు తీసుకొని వస్తున్నరోజు ఆసుపత్రి రోడ్డు బోసినోరులాగ కన్పించింది.

మొక్కల్లో ఒక్కటీ కనిపించలేదు.

మేక ఆకులు కొరుక్కుంది.

ఎనుము మొక్క పీక్కుపోయింది.

పిల్లలు మొక్కలు పీకి, వేరేచోట పాతి, మళ్ళీ పీకి పాతి-పీకి మొత్తంమీద చంపి ఆనందించారు.

ఆసుపత్రికి రోగిని తీసుకుపోతున్న ఆరోగ్యవంతుడు మొక్క పీకి పళ్లు తోంకొని ముఖం కడుక్కున్నాడు.

రోడ్డు పొడుగునా మొక్కలు పోగా, మిగిలిన గుంటలూ పడిపోగా మిగిలిన ఇటుకలూ మనిషి మంచితనాన్ని, మాలిన్యాన్ని, ఆశనీ, అంధకారాన్నీ వివస్త్రంగా వికారంగా, క్రూరంగా చూపుతున్నాయి.

ఇంటి దగ్గర పెద్దబాబు తలకి గాయమయి ఉన్నాడు.

కాకి తన్నబోతే పడ్డాడు. తల పగిలింది.

నాగమ్మ ఏడుస్తుంది.

భార్యను పిల్లల్ని చేతులకిందికి తీసుకుని కూర్చున్నాడు రామలింగం.

నాగమ్మ ఏడుపు మానింది.

పెద్దవాడు నొప్పి మర్చిపోయి కూర్చున్నాడు.

చిన్నవాడు కాళ్లు చేతులూ, రామలింగం ఆలోచనలులాగా తిప్పుతున్నాడు.

చావు పుట్టుకల మధ్య ఊగుతున్న లోకంలో పుట్టుకమీది ఆశవల్ల, చావు మీది భయంవల్ల, పెరగవలసిందేదీ పెరగవలసినట్లు పెరగటంలేదు.

నిరంతరం క్షోభ, సంఘర్షణ, వ్యధ.

రామలింగం కన్నీరు, నాగమ్మా పెద్దబాబూ చెరొక ప్రక్క తుడిస్తే కొత్త చూపు వచ్చింది.